# ఆమె

రాజ్యలక్ష్మి అతి కష్టం మీద పక్కకి వత్తిగిల్లింది. కళ్ళలో ఇసుక పోసినట్లు గరగరలాడిపోతూ మండిపోతున్నాయి. శరీరం బరువుగా, భారంగా, అణువణువూ నొప్పిగా భరించలేని బాధగా వుంది. తలలో కొన్ని కోట్ల సూదులు గుచ్చి గుచ్చి లాగుతున్నట్లుంది. మనసు ఆలోచించే శక్తిని కోల్పోతోంది. తనెక్కడుంది? తనేం చేస్తుంది? తనకేమైంది? లాంటి ప్రశ్నలు ఒక్కొక్కసారి మెదడుకి తగిలి, పగిలి ముక్కలై మాయమౌతున్నాయి. అంతలో అనేక రంగుల వలయాలు కళ్ళముందు కదులుతున్నాయి. అంతా క్షణంలో అయోమయమైపోతోంది. అపస్మారక స్థితిలోకి వెళ్ళడానికి సన్నాహాలు చేసుకుంటోంది మొద్దుబారిన బుర్ర.

"అమ్మా! ఓ అమ్మా ఇంకా లేవలేదా నువ్వు? ఛీ? ఎప్పుడూ యింతే నన్ను అయింటికి లేపమని చెప్పాను కదా? చూడు అప్పుడే ఏడుంపావు. ఎప్పుడు వెళ్ళను పేరెడ్‌కి?" ఏడుస్తూ గంతులేస్తోంది పదిహేనేళ్ళ పెద్దపాప.

లేచిన వెంటనే పాలగ్లాసు చేతికందివ్వలేదని అలిగి మూల కూర్చుంది ఎనిమిదేళ్ళ చిన్నపాప.

అయిదింటికే లేచి బాడ్‌మింటన్‌కి వెళ్ళి ఏడున్నరకి యింట్లో అడుగు పెట్టిన వంశోద్ధారకుడు వేడివేడి టిఫిన్ కోసం అటూ యిటూ వెదికి, ఏమీ దొరక్క విసురుగా బాత్‌రూంలోకి దూరి ధాం అని తలుపేసుకున్నాడు.

రాజ్యలక్ష్మికి ఒక్కసారి కొంచెం తెలివి వచ్చింది. కానీ కదలలేకపోయింది. లేచేందుకు ప్రయత్నించీ లేవలేకపోయింది.

అయ్యో తను లేవలేకపోతోంది ఎలా? ఇంట్లో పనులన్నీ ఎక్కడివక్కడ వున్నాయి– ఆమె మళ్ళీ ప్రయత్నించింది. ఆమె శరీరం అస్సలు సహకరించలేదు. అంతలోనే స్పృహ తప్పినట్లయింది.

మూడు రోజులుగా వస్తున్న జ్వరం ఆ రోజు మూలపడేసింది రాజ్యలక్ష్మిని.

ఆమెకొచ్చిన జ్వరాన్ని ఆమె ఖాతిరీ చెయ్యలేదు. అదే పోతుందిలే అనుకుంది – అయినా జ్వరమొచ్చిందని పడుకుంటే ఇంట్లో పనెలాగవుతుంది?

మొండిగా రెండు రోజులు లేచి తిరిగింది. కానీ ఆ మీదట ఆమెకి కుదరలేదు.

❖ ❖ ❖

పదహారేళ్ళకే పెళ్ళయిన రాజ్యలక్ష్మిది పండంటి సంసారం. మంచి హెూదా, డబ్బూ గల భర్త ముత్యాల్లాంటి ఇద్దరాడపిల్లలు, మధ్యలో పగడంలాంటి కొడుకు. అన్ని హంగులతో, అలంకరణతో, అదొక భూతల స్వర్గంలా వుండే అందమైన ఇల్లు.

పెళ్ళికి ముందు రాజ్యలక్ష్మి చదువుకుంది, పెళ్ళిచూపుల్లో పాట కూడా పాడింది ఆ పెళ్ళి చూపుల్లో రాజ్యలక్ష్మిలోని తెలివి తేటలకీ, చదువు సంధ్యలకీ, సంగీతానికీ అందరూ ముగ్ధులైన మాట నిజం. పెళ్ళికొడుకు భాస్కరం ఆ పిల్లనే చేసుకుంటానని ఖచ్చితంగా చెప్పి, తన వ్యక్తి స్వాతంత్ర్యాన్ని వ్యక్తం చేసి, ఇంట్లో వాళ్ళ గుండెల్లో రైళ్ళు పరుగెట్టించాడు కట్నం తగ్గుతుందేమోనని తల్లీ, చెల్లెలూ గాభరా పడ్డ మాట నిజం. అయితే రాజ్యం తండ్రి తన కూతురి అదృష్టానికి మురిసిపోయాడు. కట్నంలో కానీ తగ్గించకపోగా, అల్లుడికి అదనంగా మరో సూటు కొన్నాడు.

పెళ్ళయిన మర్నాడి నుంచీ భాస్కరం తన ప్రతి పనీ భార్య మీద ముచ్చటగా మోపేవాడు. అతని మురిపెం చూసి అంతకంటే మహాభాగ్యం మరేముందీ అని మురిసిపోయింది రాజ్యలక్ష్మి.

పెళ్ళిచూపుల్లో ఆమె పాడిన పాట మరెప్పుడూ ఆమె పెదవుల మీద కదలలేదు. ఎన్నడూ, ఆ యింట్లో ఆమె నెవ్వరూ పాటపాడమని అడగలేదు. ఆమె చదువుకున్న చదువు కూడా కనీసం పేపరు చదవడానికి కూడా అక్కరకు రాలేదు. ఎందుకంటే ఆ క్షణం కూడా ఆమె భర్త సేవలో తరించేది. అలా తరించక తప్పేది కాదు.

ఉదయం అయిదు గంటలకి లేచింది మొదలు భర్తకి పేస్టు అందివ్వడం దగ్గర మొదలు పెట్టి బూట్‌పాలిష్ చెయ్యడం, స్నానానికి నీళ్ళు తోడివ్వడం, ఒళ్ళు రుద్దడం, సాక్స్, రుమాలు ఇస్త్రీ చెయ్యడం టిఫిను తయారు చెయ్యడం, దగ్గరుండి తినిపించడం.

అతను బయటకెళ్ళేవరకూ అడుగులో అడుగులేస్తూ అతన్ని అనుసరించి అన్నీ అందించి, కృతార్థురాలయ్యేది. పెళ్ళయిన కొత్తలో భర్త నోటివెంట ఎలాంటి మాట వచ్చినా అది రసగుళికలా అనిపించేది గానీ మరోలా తోచేది కాదు. అతను హేళన చేసినా, ఆట పట్టించినా ఆనందంగానే స్పందించేది గానీ, అవమానంగా భావించేది కాదు.

"భర్తకి అనుకూలంగా వుండే భార్యే భార్య. అతని మంచిచెడ్డలు, ఆలనా, పాలనా అనుక్షణం చూసుకునేదే భార్య. భర్త నెదిరించి బయట వ్యవహారాలు చేసే ఆడదంటే నాకిష్టముండదు".

"భర్త యిష్టాలు కాక వేరే యిష్టాలు వుండాల్సిన అవసరం ఏముంటుంది భార్యకి."

ఇల్లాలు ఇంటికే పరిమితంగానీ ఊరికీ, దేశానికీ కాదు"

ఇలాంటి స్టేట్‌మెంట్లు భాస్కరం పెళ్ళయిన కొత్తలో తరచూ యిస్తూండేవాడు.

అవి విన్నప్పుడు ఒక్కొక్కసారి ఆనందపడిపోయేది. ఒక్కొక్కసారి సిగ్గుపడి, లోపలికి పారిపోయేది. అప్పుడప్పుడైతే ముఖాన్ని ముద్ద మందారంలా మరింత అందంగా చేసుకుని మురిసిపోయేది.

❖ ❖ ❖

ఆ రోజు వుదయం రాజ్యలక్ష్మి అన్నయ్య చంద్రశేఖరం, వదిన సత్యవతి పిల్లలతో దిగారు. వాళ్ళుండేది ఇక్కడ కాదు అమెరికాలో. పెళ్ళికి కూడా ఒక్క అన్నయ్యే వచ్చాడు. వదినా పిల్లలూ రాలేదు.

రెండు సంవత్సరాల తర్వాత యిప్పుడు సకుటుంబంగా అన్నయ్య రావడంతో, అదీ ఇండియా వస్తూనే తమింటికి రావడం రాజ్యలక్ష్మికి మరీ ఆనందాన్నిచ్చింది.

వాళ్ళు యింట్లో అడుగుపెట్టినప్పటి నుంచీ భర్త ప్రవర్తన, మాటలూ చూసి, విని ఆశ్చర్యపోయి, క్రమంగా వుక్రోషపడిపోయింది. నిజానికి మాటలు మామూలుగా ఎప్పుడూ అనేవే. కానీ ఆ మాటలు భరించటం అంత కష్టమని అప్పుడే మొదటిసారి అనిపించింది రాజ్యలక్ష్మికి.

భాస్కరం, రాక రాక వచ్చిన బావమరిదిని చాలా మర్యాద చేశాడు. సత్యవతిని పొగడ్తలతో ముంచెత్తి పారేశాడు.

"చూడండి అక్కయ్యగారూ! మా ఆవిడ వట్టి మొద్దు సుమండీ! ఏదో చదువుకుంది గానీ, చదువుకున్న వాళ్ళకుండే చమక్కుమాత్రం లేదు" అన్నాడు నవ్వుతూ.

మొదట ఈ మాటలకి చిన్నబుచ్చుకున్నా సరదాగా కొట్టిపారేసింది కానీ భాస్కరం మాటలు మరీ భరించలేనివిగా తయారయ్యాయి.

"అన్నగారూ - మా ఆడబిడ్డనీ మరీ ఆటపట్టిస్తున్నారు" అంది సత్యవతి కొంత అమెరికా స్టయిల్లో భుజాలెగరేస్తూ -

అబ్బే నిజంగా, చాలా ఎడ్డి మడ్డి స్వరూపమండీ బాబూ! మీకేం తెలుసు? ఎప్పుడూ చేసిన పని చేస్తున్నట్లు వుంటుంది" అన్నాడు.

"మరే పాపం! పనేం లేకుండా వుందా? పొద్దుట నుంచీ చేసినా తరగని పని" అంది రాజ్యం వీలయినంత నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"ఇదిగో, చూడూ పని చేయడంలో కూడా స్కిల్ వుంటుంది. ఆ నైపుణ్యం లేనివాళ్ళకి అరగంటలో అయే పని రెండు గంటలు పడుతుంది" అన్నాడు.

"పోనీలెండి" అంది అవమానంతో -

"అవమానపడిపోకు. మీ వదిన చూడు ఎంత ఫ్రెష్‌గా వున్నారో! ఆమెకి యిద్దరు పిల్లలుంటే ఎవ్వరూ నమ్మరు. అదే నీకు ఒకే పిల్లాడైనా - నలుగురి పిల్లల తల్లిలా - వున్నావు" - అన్నాడు.

"బావగారు మా చెల్లెల్ని మరీ ఏడిపిస్తున్నట్లున్నారే" అన్నాడు చంద్రశేఖరం. అప్పటికే రాజ్యలక్ష్మి కళ్ళలో నీరు వురకడానికి సిద్ధంగా వుంది.

"అబ్బే నా కలాంటిదేమీ ఎదు. ఊరికే పోలిక చెప్తున్నా."

"ఏం మొద్దూ ఈ టేబులు శుభ్రంగా లేదు. తుడు - అసలే వాళ్ళు అమెరికా నుండి వచ్చారు"

"నీకు యిల్లు సర్దడమే రాదు"-

"ఎప్పుడూ పాతకాలపు టిఫిన్లే గానీ కొత్తగా ఏమీ రావు. తెలుసుకుందామనే ఆసక్తే లేదు."

ఇలా సాగుతూనే ఉంది అతని ధోరణి. మధ్య మధ్యలో చంద్రశేఖర్ అడ్డు తగులుతూనే వున్నాడు రాజ్యలక్ష్మిలో వుత్సాహం చచ్చిపోవడమే కాకుండా తనూ ఒక వ్యక్తిత్వం వున్న మనిషని, యీ విధంగా అవమానపడడం ఆత్మాభిమానానికి దెబ్బని మొదటిసారిగా గ్రహించింది. చంద్రం ఏం మాట్లాడాలో తెలీక "అదేవిటే రాజూ! చిన్నప్పుడంత చురుకుగా, తెలివిగా వుండేదానివి. ఇప్పుడింత డల్‌గా అయిపోయావు" అన్నాడు. ఈ దెబ్బతో ఆమె తోక తొక్కిన తాచులా కస్సుమంది.

"ఏమీ లేదన్నయ్యా! భార్యని ఒక పని మనిషిగా జీతం, బత్తెం లేని బానిసగా భావించేవారికి, నాలోని తెలివీ, చురుకుతనం ఎలా కనిపిస్తాయి" అందామనుకుంది. కానీ నిగ్రహించుకుంది. వదిన ముందు అలుసైపోవడం యిష్టం లేక ఒక వెర్రి నవ్వు నవ్వి వూరుకుంది.

అప్పటి నుండీ నెమ్మదిగా ఆలోచనలో పడింది. అసలు పండంటి సంసారమంటే ఏమిటి?-

భార్యకి భర్త తప్ప మరో ధ్యాస వుండకూడదు. అతనికి అన్ని విధాలా అనుకూలంగా వుండాలి. అతని పిల్లలకి అన్నీ అమర్చి, వారిని అల్లారుముద్దుగా పెంచాలి. ఏమాత్రం అటూ యిటూ అయినా 'వాళ్ళు నా పిల్లలు' అని క్లయిమ్ చేస్తూ వుంటే తను మాత్రం తలొంచుకుంది. ఊహ తెలిసినప్పటినుంచీ తండ్రి దగ్గర తర్ఫీదయిన పిల్లలు తల్లి విలువ తెలుసుకోలేరు. భర్త చీదరిస్తే పిల్లలు ఆదరిస్తారనుకోవడం కూడా అత్యాశే!

వాళ్ళు అమ్మని గురించి ఏమనుకుంటారు?

అమ్మంటే, సూర్యుడుదయించకుండా లేచేది అమ్మ. తాము నిద్ర లేచేసరికి కాఫీ, టిఫిన్లు, వేణ్ణీళ్ళ, ఇస్త్రీ యూనిఫారాలు, టిఫెన్ బాక్సులు అమర్చేది అమ్మ - ఆకలితో సాయంత్రం యింటికొస్తే - ఏదో ఒకటి పెట్టి ఆటలకి పంపి, వచ్చేసరికి కంచంలో అన్నం పెట్టి, తినిపించి నిద్రపోకుండా తమతో బాటు కూర్చుని హోంవర్కు చేయించి, చేసి, తాము నిద్రపోయాక, తాను నిద్రపోయేది అమ్మ.

స్కూలుకెళ్ళేప్పుడు టైంటేబుల్ ప్రకారం పుస్తకాలు సర్దిపెట్టేది అమ్మ.

తెల్లవారకుండా ఎన్.సి.సి.కి వెళ్ళాలంటే లేపేది అమ్మ - వార్షికోత్సవం రోజున ఫాన్సీ డ్రస్ వేయడానికి కావలసిన సరంజామా సమకూర్చి తనని చూసి మురిసిపోయేది అమ్మ.

నాన్నగారు అమ్మనేదైనా అంటుంటే తామూ నాన్నగారి వెనకాల చేరి అమ్మని తీసి పారేస్తే, మారు మాట్లాడకుండా వుండేది అమ్మ-

❖ ❖ ❖

తొమ్మిది గంటలకి యింకా మంచం మీద వున్న భార్యని చూసి మొదట చాలా చిరాకుపడ్డాడు భాస్కరం.

ఎందుకంటే అతనికన్ని పనులూ టైము ప్రకారం జరిగిపోవాలి. ఒక్క క్షణం అటూ యిటూ అయినా భరించలేడు. అందుకే అతనికి చిరాకు, కోపం ఒక్కసారే

వచ్చాయి. అంతేగానీ ఎప్పుడూ పడుకోనీ భార్య ఎందుకిలా పడుకుందీ అనే అనుమానం రాలేదు. దగ్గరకెళ్లి విసురుగానే "ఏమిటోయ్! రాజ్యం, ఇంకా ఏమిటా నిద్ర? ఎంత పొద్దెక్కిందో తెలుసా" అన్నాడు.

రాజ్యంలో చలనం లేదు. అప్పుడతనికి భయం వేసింది. వంటి మీద చేయి వేసి చూసి ఫులిక్కిపడ్డాడు. జ్వరం కాలిపోతోంది. స్పృహలో లేదు.

అయిదు నిముషాల్లో రాజ్యంని హాస్పిటల్లో చేర్పించాడు. డాక్టరు అడిగిన మొదటి ప్రశ్న:

"ఎప్పట్నించి జ్వరం. ఇలా ఎప్పట్నించీ అయ్యింది"

ఇంట్లో ఎవ్వరూ సమాధానం చెప్పలేకపోయారు.

"అంటే. యింట్లో మనిషి అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయే వరకూ ఆమె నెవ్వరూ పట్టించుకోలేదన్నమాట" అంది డాక్టరమ్మ.

"అస్సలేమీ చెప్పలేదు. నాకు వంట్లో బాగుండలేదని చెప్పాలి కదా!" అన్నాడు భాస్కరం తగ్గు స్వరంలో.

"అంటే ఆమె ప్రతిదీ మీకు నోరు విప్పి చెప్పుకుంటే గానీ చూసి గ్రహించలేరన్న మాట. ఒక గంటలో అరగంటలో వచ్చింది కాదిది".

"ఇరవై నాలుగు గంటలూ ఇంట్లో ఒళ్ళు విరుచుకుని పనిచేసే మనిషి పడుకుంటే ఏమైందనే ఆలోచనే మీకు రాలేదు".

చకచకా వైద్యం జరిగింది. ఆమె లంగ్స్‌లో నెమ్ము పేరుకుంది.

పదిహేనేళ్ళ పెద్దపాప మొదటిసారిగా కాఫీ తయారుచేసింది.

ఎనిమిదేళ్ల చిన్నపాప సొంతంగా మొదటిసారి స్నానం చేసింది.

వంశోద్ధారకుడు ఫ్లాస్క్‌లో తల్లికి కాఫీ పట్టుకెళ్ళాడు.

భాస్కరం మాత్రం భార్య అనారోగ్యం గురించి చాలా చిరాకు పడిపోయాడు.

"శ్రద్ధలేదండీ. ఆరోగ్యం ఎంత జాగ్రత్తగా చూసుకోవాలండీ. వట్టి ఎడ్డి మడ్డి స్వరూపం. గుడ్డి ఎద్దులా పని చేసుకుపోవడమేగానీ ఆలోచన లేదు" అంటూ అందరి దగ్గరా విమర్శల వర్షం కురిపించాడు.

❖ ❖ ❖

నెలాళ్ళ తర్వాత కాస్త మామూలు మనిషైంది రాజ్యలక్ష్మి. ఇప్పుడామెకి చాలా విషయాలు అర్థమయ్యాయి. పిల్లలకిగానీ, భర్తకిగానీ ఎవరి పనులు వారు చేసుకునే స్వయం జీవన విధానం అలవరచాలి. అంతేగానీ భార్యగా, తల్లిగా ఒక జీవిత బానిసగా

మారి వారిని సోమరులుగా తయారు చెయ్యకూడదు, ఎదుటివారు ప్రతి పనీ చేసి పెడుతున్నంత కాలం వారి అవసరాలు వారు గుర్తించరు చేసే ఎదుటి వ్యక్తి కష్టసుఖాలు పట్టించుకోరు.

తను మారాలి. ఇది మంచి కోసమేగానీ, మరెందుకూ కాదు అనుకుంది రాజ్యలక్ష్మి.

ఆ రోజు భాస్కరం యింటికి వస్తూనే అన్నాడు. "ఇదిగో రాజ్యం! నీకు ఆరోగ్యం బాగుండకపోతే ముందే చెప్పు. అంతేగానీ ముదరపెట్టుకుంటే చాలా తైలమే ఖర్చయ్యింది. ఇప్పుడు చూడు - అయిదువేలు - ఎవరు తిన్నది? హూ.."

రాజ్యం మనసు చివుక్కుమంది. తనకి అనారోగ్యం చేస్తే భర్త డబ్బు ఖర్చు పెట్టాడు. పిల్లలు సేవ చేశారు. ఏం? తనకా హక్కు, అర్హత లేవా?

ఆమె ఒక స్థిర నిర్ణయానికొచ్చింది. గంభీరంగా అంది. "ఆగండి ఒక్క మాట. మళ్ళీ చెప్పలేదనుకునేరు. అందుకే ముందే చెప్తున్నాను. ఈ రోజు నుండీ ఎవరి పనులు వారే స్వయంగా చేసుకోండి"

"అంటే"

"అంటే మీ పేస్టు మీరే వేసుకోండి. మీ నీళ్ళు మీరే తొలుపుకోండి. మీ బూట్లూ, సాక్సు, మీ బట్టలూ మీరే చేసుకుని సిద్ధం చేసుకోండి"

"ఇంకా నయం నా వంట నన్నే చేసుకోమన్నావు కాదు"

"అవును. కాఫీ, టిఫిన్, భోజనం తయారుచేసి సిద్ధపరుస్తాను" అని పిల్లల వైపు తిరిగి.

"పెద్దపాపా! చిన్నపాపా! బాబూ! మీకూ యిదే చెప్తున్నాను. ఉదయం లేచింది మొదలు మీ పనులన్నీ మీరే స్వయంగా చేసుకోండి".

"మరి..."

"అవును అందుకే ముందే చెప్తున్నాను. మళ్ళీ చెప్పలేదనుకునేరు" అంది భర్త వంక చూస్తూ.

అవును మరి!

భార్యంటే భాగస్వామి. ఎప్పుడూ పని చేసుకుపోయే యంత్రమూ కాదు. బానిసా కాదు.

అమ్మంటే అమ్మే - బానిస కాదు.

(రచన, జులై 1992)